క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

గరుగుబిల్లి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీదేవి శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి, చేపట్టే ఈ ప్రవేశాలకు 2010 సెప్టెంబరు నుంచి 2014 ఆగస్టులోపు పుట్టిన ఎస్సీ, ఎస్టీ బాలికలు, 2012 సెప్టెంబరు నుంచి 2014 ఆగస్టు 31వ తేదీలోపు పుట్టిన బీసీ, ఓసీ బాలికలు అర్హులన్నారు. ఈ నెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

సంతోషిమాతకు ప్రత్యేక పూజలు

భామిని: మండలంలోని బత్తిలి గ్రామ సంతోషి మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు రంపా తాతబాబు శర్మ ఆధ్వర్యంలో ఉదయం మహిళలతో కుంకుమార్చనలు, ఉద్యాపన పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో శిలువ యాత్ర



శిలువ యాత్రలో క్రైస్తవులు

భామిని: మండలంలోని తివ్వాకొండల్లో ఏసు క్రీస్తు శిలువ యాత్ర శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నల్లరాయిగూడ చర్చ్ ఫాదర్ డోమినిక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్రైస్తవులంతా పాల్గొని, క్రీస్తును ఆరాధించారు. పవిత్ర గ్రంథం బైబిల్‌లోని ముఖ్యాంశాలను వివరించి, జీసస్ బోధనలు అనుసరించాలని కోరారు.

చెరకు ట్రాక్టరు బోల్తా



తంపటాపల్లి దగ్గర బోల్తాపడిన చెరకు ట్రాక్టరు

పాలకొండ రూరల్: మండలంలోని తంపటాపల్లి గ్రామ కూడలి వద్ద శుక్రవారం పాలకొండ వైపు చెరకు లోడుతో వెళ్తున్న ఓ ట్రాక్టరు అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో రోడ్డుపై చెల్లాచెదురుగా చెరకు కట్టలు పడిపోవడంతో అటు వైపుగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. స్థానికుల సహాయ సహకారాలతో చెరకు కట్టలను తీసి, ట్రాఫిక్ క్లియర్ చేశారు.

గడ్డిమందు తాగిన వ్యక్తి

సీతానగరం: మండలంలోని చెల్లన్నాయుడువలస పొలంలో గడ్డి మందు తాగి ఓ వ్యక్తి అపస్మారక స్థితిలోకి చెందాడు. 108 సిబ్బంది తెలిపిన వివరాలు... చెల్లన్నాయుడువలస గ్రామానికి చెందిన దాసరి మురళి తన పొలంలో ఉన్న గడ్డి మందు తాగారని సమాచారం రావడంతో సంఘటనా స్థలానికి వెళ్లి ప్రథమ చికిత్స అందించినట్టు తెలిపారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టును తరలించొద్దు



వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సాలూరు: ఐసీడీఎస్‌ల విలీనంలో భాగంగా సాలూరు రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టును వేరే ప్రాంతానికి తరలించవద్దని అంగన్‌వాడీలు కోరారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు మహేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం రూరల్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి సుమారు 40 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉన్నాయని తెలిపారు. వాహన సౌకర్యాలు లేని గిరిశిఖర గ్రామాలు సుమారు 70 శాతం ఉన్నాయన్నారు. ప్రస్తుత రూరల్ ఐసీడీఎస్ కార్యాలయం అందరికి అన్ని విధాలా అందుబాటులో ఉన్నదని తెలిపారు. దీనిని తరలిస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు స్పందించి, తమ సమస్యను అర్థం చేసుకుని ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టును తరలించవద్దని కోరారు.

అకాల వర్షం.. అపార నష్టం

- రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు
- పలుచోట్ల ఈదురుగాలులతో కురిసిన అకాల వర్షం
- 260 ఎకరాలకు పైగా పంటనష్టం
- ఆందోళనలో రైతాంగం



గరుగుబిల్లి: నేలకొరిగిన అరటి పంట

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు, బట్లభద్ర, బాసంగి, వెంకటరాజపురం, గవరంపేట గ్రామాల్లో గురువారం రాత్రి అకాల వర్షం కురిసింది. దీంతో ఆయా ప్రాంతాల్లోని అరటి, మొక్కజొన్న, ఇతర పంటలు బాగా దెబ్బతిన్నాయి. వర్షంతో పాటు వీచిన ఈదురుగాలులకు దాదాపు 150 ఎకరాలకు పైగా పంట నష్టం జరిగినట్లు సమాచారం. వేలకు వేల రూపాయలు మదుపులు పెట్టి, పండించిన పంట ఒక్కసారిగా పోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, పంట నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

కొమరాడ: మండలంలోని కళ్లికోట, దుగ్గి, గుణానపురం గ్రామాల్లో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. దీంతో ఆయా గ్రామాల్లోని పలు పంటలు పాడయ్యాయి. కళ్లికోటకు చెందిన రైతు శీర తిరుపతిరా ఐదెకరాల్లోని మొక్కజొన్న పంట నాశనం కాగా, ఈ మేరకు ఆయన ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

భామిని: మండలంలోని నేరడి-బి, గురండి, బిల్లుమడ, కాట్రగడ-బి గ్రామాల్లో గురువారం కురిసిన వర్షానికి అక్కడి మొక్కజొన్న సహా ఇతర పంటలకు నష్టం జరిగింది. నేరడి-బి గ్రామంలో దాదాపు 10 ఎకరాల్లోని మొక్కజొన్న పంట ఈదురుగాలులకు నేలకొరిగింది.

గరుగుబిల్లి: మండలంలోని గిజబ, నందివానివలస, సంతోషపురం గ్రామాల్లో గురువారం రాత్రి భారీ ఈదురుగాలులతో కురిసిన వర్షానికి అక్కడి మొక్కజొన్న, అరటి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆయా గ్రామాల్లోని దాదాపు 100 ఎకరాల్లోని పంట నేలమట్టం కాగా బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరిగ్గా పంట బాగుందన్న సమయంలో అకాల వర్షం తమ కొంప ముంచిందని వాపోతున్నారు. అధికారులు స్పందించి, నష్టపరిహారం వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



కొమరాడ: కళ్లికోటలో నేలకొరిగిన మొక్కజొన్న పంటను చూపిస్తున్న రైతు



భామిని: నేలకొరిగిన మొక్కజొన్న పంటలో వర్షపునీరు



గరుగుబిల్లి: నేలమట్టమైన మొక్కజొన్న, అరటి పంటలను సరిచేస్తున్న మహిళా రైతు

శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించాలి



స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు

వీరఘట్టం: విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించాలని ఎంఈఓ పద్రి కృష్ణమూర్తి సూచించారు. శుక్రవారం స్థానిక బాలిక ఆశ్రమోన్నత పాఠశాలలో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే చిన్నప్పటి నుంచే విద్యార్థులకు సైన్స్ అంశాలు, ప్రాజెక్టులపై ఆసక్తి పెంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు, హెచ్ఎం దూసి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



రోగుల ఆరోగ్యం పరీక్షిస్తున్న వైద్యురాలు శ్రావణి

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన రోగులకు వైద్యులు పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రతిఒక్కరూ చిరుధాన్యాలు వినియోగించి, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని డాక్టర్ డి.శ్రావణి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.సింహాచలమ్మ, కార్యదర్శి ఎస్. శ్రీనివాసులు, ఎన్.ఎస్.ఎస్.కో–ఆర్డినేటర్ బి.హరిరాం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా రామమందిర ప్రతిష్ఠోత్సవాలు



ప్రతిష్ఠించడానికి సిద్ధం చేసిన పూర్ణకలశం, దేవతామూర్తులు

సీతానగరం: మండలంలోని టీటీడీ – సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన రామమందిరం ప్రతిష్ఠ ఉత్సవాలు ఆగమ వేద పండితుడు మైలారబట్ల ప్రసాదరావు శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. సమరసత సేవా ఫౌండేషన్ సౌజన్యంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సహకారంతో పార్వతీపురం మన్యం జిల్లాలో మొదటి విడతగా మంజూరు చేసిన నిధులతో నిర్మించిన ఆలయాల్లో చిన్నారాయుడుపేట ఒకటి.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు రెండు రోజుల జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. గ్రామస్తులు చేసిన కృషితో ఆలయ నిర్మాణం వేగవంతమైంది. రామమందిరం ప్రతిష్ఠను పురస్కరించుకుని ఆగమ వేద పండితుల సూచన మేరకు కల్యాణం నిర్వహించేందుకు మహిళా భక్తులు పూజా సామగ్రిని సిద్ధం చేశారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనరు వాసిరెడ్డి నాగేశ్వరరావు, జోనల్ ధర్మ ప్రచారకులు అడారి గంగాధర్, డివిజన్ స్థాయి ప్రచారకులు దేవళ్ల సురేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలు అధిగమించాలి

జియ్యమ్మవలస: పీఎంజేవై, మనబడి నాడు–నేడు పథకం, ఇతర అభివృద్ధి పనుల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని ఎంపీడీఓ రమేష్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని సచివాలయాన్ని సందర్శించిన ఆయన అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమస్యల పరిష్కారం కోసం సచివాలయానికి వస్తున్న ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలని, వారి సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అర్హులకే పథకాలు అందేలా చూడాలని తెలిపారు. అంతకుముందు రికార్డులు పరిశీలించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరాతీశారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి

భామిని: ప్రతీ రైతు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని ఎంపీటీసీ, జేసీఎస్ మండల కో–ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, వీఏఏ జ్యోతి సూచించారు. మండలంలోని సొలికిరి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రైతు సదస్సులో పాల్గొన్న వారు రబీ సీజన్‌లో పండించే ప్రతీ పంటకు ఈ–క్రాప్ నమోదు చేయించాలని, ఇలా చేస్తే పంట నష్టం జరిగేటప్పుడు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చే అవకాశం ఉందన్నారు.

సీతారాముల కల్యాణానికి ముహూర్తపు రాట

సాలూరు: శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణానికి పట్టణంలో డబ్బివీధి రామమందిరం వద్ద ముహూర్తపు రాటను ఆదివారం వేశారు. పతివాడ గంగరాజు, లక్ష్మి దంపతులచే ముహూర్తపు రాటను శాస్త్రోక్తంగా వేశారు. దీంతో ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది.

ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుపై వడ్డీ మాఫీ

పార్వతీపురం టౌన్: సకాలంలో ఆస్తి, ఖాళీ స్థలం పన్నులు చెల్లించిన వారికి వడ్డీ మాఫీ ఉంటుందని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. ఆస్తి పన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం జీఓఎంఎస్ నెం.34 ఉత్తర్వుల మేరకు పురపాలక సంఘ పరిధిలో ఆస్తి, ఖాళీ జాగా పన్నుల విషయంలో ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలు ఈ ఆర్థిక సంవత్సరం పన్నుపై విధించిన వడ్డీని వన్ టైమ్ మెజర్‌గా మాఫీ చేయడం జరిగిందన్నారు. ఈ నెలాఖరులోగా పన్ను బకాయి చెల్లించాలన్నారు.

ట్రాఫిక్ కష్టాలకు చెక్!

- కురుపాంలో ట్రాఫిక్ ఇక్కట్లు తొలగేలా రోడ్డు విస్తరణ
- రూ.39.40 లక్షల వ్యయంతో పనులకు శ్రీకారం
- చురుగ్గా తోటపల్లి–పెదమేరంగి మధ్య పనులు



కురుపాంలో రోడ్డు విస్తరణ కోసం కొలతలు వేస్తున్న రోడ్లు, భవనాల శాఖ అధికారులు

కురుపాం: ఇరుకైన రోడ్డు కారణంగా దశాబ్దాలుగా కురుపాం మండల కేంద్రంలో నెలకొన్న ట్రాఫిక్ ఇక్కట్లకు త్వరలోనే తెరపడనుంది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో దాదాపు రూ.39.40 లక్షల వ్యయంతో రోడ్డు విస్తరణ పనులతో పాటు, కాలువలు, కల్వర్టుల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. తోటపల్లి నుంచి కురుపాం వరకు 14 కిలోమీటర్ల మేర ఈ పనులు జరుగుతాయి. ప్రస్తుతం తోటపల్లి గ్రామం నుంచి పెదమేరంగి గ్రామం వరకు పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా, శుక్రవారం రోడ్లు, భవనాల శాఖ డీఈఈ నాగమోహనరావు, జేఈ నిర్మల సిబ్బందితో కలిసి కురుపాంలోని ధూళికేశ్వరస్వామి ఆలయం నుంచి బస్టాండ్ కూడలి వరకు ఉన్న రోడ్డుకు ఇరువైపులా విస్తరణకు సంబంధించి, మార్కింగ్(కొలతలు) వేశారు. మధ్యాహ్నం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించారు. మండల కేంద్రంలో నెలకొన్న ట్రాఫిక్ ఇబ్బందులు తొలగాలంటే అధికారులు, స్థానికులు సహకరించాలని అధికారులు కోరారు.

ఒడిశా నుంచి భారీ వాహనాలు..

అటు ఒడిశా నుంచి ఇటు మన రాష్ట్రం నుంచి భారీ వాహనాలు కురుపాం మండల కేంద్రం మీదుగా రాకపోకలు సాగించడంతో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతుంటుంది. దీంతో అటువైపుగా ప్రయాణించే వారంతా తీవ్ర ఇబ్బందులు పడేవారు. గంటల తరబడి రోడ్లపైనే వేచి చూడాల్సిన దుస్థితి ఉండేది. ఇదే సమస్య పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులంతా కలిసి, పోరాడినా ఫలితం లేకపోయింది. ఎట్టకేలకు ఇప్పుడు అధికారంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులపై దృష్టి సారించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కురుపాం మండల కేంద్రంలో జేసీబీతో ఆక్రమణల తొలగింపు

పెన్నులు, పుస్తకాల వితరణ



పెన్నులు, పుస్తకాలతో పిల్లలు

పాలకొండ రూరల్: మండలంలోని తంపటాపల్లి గ్రామంలో ఉన్న అమ్మఒడి ఆశ్రమంలోని పిల్లలకు వైస్ ఎంపీపీ వాకముడి అనీల్‌కుమార్, ఉమారాణి దంపతులు పెన్నులు, పుస్తకాలు, తినుబండారాలు శుక్రవారం వితరణ చేశారు. దాతలు మరింత ముందుకు వచ్చి, పిల్లలను ఆదుకోవాలని ఆశ్రమ నిర్వాహకుడు ఆనంద్‌పాల్ కోరారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి



మధ్యాహ్న భోజనం వంటలపై ఆరాతీస్తున్న ఎంపీడీఓ త్రినాధులు

పాలకొండ రూరల్: సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి అని ఎంపీడీఓ డొంక త్రినాధులు సూచించారు. మండలంలోని అంపిలి, ఎం.సింగుపురం గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన ప్రజాసమస్యలు–వాటి పరిష్కారంపై ఆరాతీశారు. అనంతరం అక్కడి సచివాలయాలను సందర్శించి, రికార్డుల నిర్వహణ, ప్రజలకు పథకాలు అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అంపిలి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై ఆరాతీసి, మెనూ ప్రకారం పిల్లలకు వంటకాలు వండిపెట్టాలన్నారు.

ప్రతిరోజూ దంతాలను శుభ్రం చేసుకోవాలి



దంతాల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డెంటిస్ట్ రేణుక

సీతంపేట: ప్రతిరోజూ దంతాలను శుభ్రం చేసుకోవాలని సీతంపేట ఏరియా ఆస్పత్రి దంతవైద్య నిపుణులు రేణుక సూచించారు. శుక్రవారం స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో దంతాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె దంతాలు ఎలా శుభ్రం చేసుకోవాలన్న విషయం విద్యార్థులకు తెలియజేశారు. ప్రతిఒక్కరూ బ్రష్ చేసుకునేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, లేకపోతే పళ్లు పాడైపోతాయన్నారు. అతి చల్లని, వేడి ఆహార పదార్థాలు తీసుకోవద్దన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎ.లిల్లీరాణి తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన



ర్యాలీలో రావివలస పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

గరుగుబిల్లి: మండలంలోని రావివలస గ్రామంలో క్షయవ్యాధి నివారణపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రావివలస పీహెచ్‌సీ వైద్యాధికారి కె.అరుణకుమారి మాట్లాడుతూ తరచూ దగ్గు వస్తే ఆస్పత్రిలోని వైద్యులను సంప్రదించాలన్నారు. క్షయతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులతో పాటు పౌష్టికాహారం కూడా ఇవ్వడం జరుగుతోందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, క్షయవ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది జి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

30 క్వింటాళ్ల చింతపండు కొనుగోలు



రాముడుగూడ గ్రామంలో చింతపండు కొనుగోలు చేస్తున్న జీసీసీ అధికారులు

కురుపాం: మండలంలోని జి.శివడ జీసీసీ డిపో పరిధిలోని రాముడుగూడ గ్రామంలో 30 క్వింటాళ్ల చింతపండు కొనుగోలు చేసినట్లు గుమ్మలక్ష్మీపురం జీసీసీ పాయింట్ సూపరింటెండెంట్ సాంబమూర్తి శుక్రవారం తెలిపారు. జీసీఎం సొసైటీ మేనేజర్ వి.కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఎంఎస్‌పీ(మినిమం సపోర్ట్ ప్రైస్) ప్రకారం కిలో రూ.32.40 కింద చింతపండు కొనుగోలు చేయడం జరుగుతోందన్నారు. దళారులను నమ్మవద్దని, గిరిజన రైతులను కోరారు.

నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

భామిని: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట రెవెన్యూ ఉద్యోగులు శుక్రవారం నిరసన చేపట్టారు. రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు మధ్యాహ్నం చేపట్టిన ఈ కార్యక్రమంలో సకాలంలో జీతాలు చెల్లించాలని, డీఏ బకాయిలు ఇవ్వాలని, సీపీఎస్ రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు నీలాపు అప్పారావు, డీటీలు నిమ్మల శేఖరం, జె.రమేష్‌కుమార్, ఆర్ఐ రాంబాబు, వీఆర్‌ఓలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత



యోగా సాధన చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు

పాలకొండ: యోగా చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని వక్తలు తెలిపారు. మండలంలోని అన్నవరం పీహెచ్‌సీలో గ్రామీణ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్)లకు యోగాపై శిక్షణ శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ప్రతిఒక్కరూ యోగా సాధన చేయాలని వక్తలు కోరారు.

బత్తిలిలో 'వైఎస్సార్ పొలంబడి'



రైతులతో మాట్లాడుతున్న ఎంఏఓ సింహాచలం

భామిని: మండలంలోని బత్తిలి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కో–ఆప్షన్ సభ్యుడు విశ్వనాథ పట్నాయక్, ఎంఏఓ సింహాచలం కలిసి తెగుళ్లు, చీడపీడల నుంచి వరి పంటను కాపాడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. క్రమపద్ధతిలో ఎరువులు వాడాలని, రసాయన ఎరువుల వాడకం బాగా తగ్గించాలని తెలిపారు. ఈ–క్రాప్ నమోదు వేగవంతం చేయాలని కోరారు.

సంపూర్ణ పోషణ యాప్‌లో హాజరు నమోదు



అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలిస్తున్న ఐసీడీఎస్ పీఓ సుశీలదేవి

గుమ్మలక్ష్మీపురం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ప్రీ–స్కూల్ పిల్లల హాజరును సంపూర్ణ పోషణ యాప్‌లో నమోదు చేయాలని భద్రగిరి ఐసీడీఎస్ పీఓ సీహెచ్ సుశీలదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తన కార్యాలయంలో భద్రగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశమైన ఆయన గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు తప్పనిసరిగా పౌష్టికాహారం ఇవ్వాలన్నారు. మండలానికి ఓ మోడల్ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారని, ఈ నేపథ్యంలో ప్రతీ అంగన్‌వాడీ కేంద్రం పనితీరు బాగుండాలని ఆ దిశగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు.